క్లుప్తంగా

రహదారి నిర్మించాలి

సీతంపేట: మండలంలోని పూతికవలస పంచాయతీ గూడంగి గ్రామానికి రహదారి నిర్మించాలని గిరిజన సంఘం నాయకులు బి.శ్రీరాములు, సాయికుమార్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఐటీడీఏ అధికారులు గ్రామస్థాయిలో పరిశీలన చేయాలని కోరారు. గతంలో మండల స్థాయి సమావేశాల్లో కూడా రహదారి, మంచినీటి సౌకర్యం కల్పించాలని సర్పంచ్‌లు కోరినా పట్టించుకున్న వారు లేరన్నారు. ఇప్పటికైనా స్పందించాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గరుగుబిల్లి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ సహా నాగూరు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ బి.శంకరరావు ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. విద్యుత్ మరమ్మతులతో పాటు విద్యుత్ తీగలకు ఆనుకుని ఉన్న చెట్లకొమ్మలు తొలగిస్తున్న నేపథ్యంలో ఈ అసౌకర్యం కలుగుతోందన్నారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక



గుమ్మలక్ష్మీపురం: రాష్ట్ర స్థాయి పరుగుపందెం పోటీలకు మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థి మండంగి కార్తీక్ ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ ఆర్ఎస్‌వీ ప్రసాదరావు, పీఈటీ టి.గోవిందరావులు బుధవారం తెలిపారు. ఏలూరులో గురువారం జరిగే పోటీలకు సదరు విద్యార్థి బుధవారం పయనం కాగా, పాఠశాల సిబ్బంది ఆల్‌ది బెస్ట్ చెప్పారు. ఇటీవల అండర్-14 విభాగంలో జిల్లా స్థాయిలో జరిగిన 100 మీటర్ల పరుగు పందెంలో కార్తీక్ విశేష ప్రతిభ కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

అంజనా ఫౌండేషన్‌తో ఎంఓయూ

పాలకొండ రూరల్: విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసేందుకు అంజనా ఫౌండేషన్‌తో ఎంఓయూ చేసుకున్నట్లు డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ బి.జయమణి బుధవారం తెలిపారు. ఈ ఒప్పందం మేరకు కళాశాలలో చదువుతున్న విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధి అంజనా ఫౌండేషన్ కృషిచేస్తుందన్నారు. తృతీయ సంవత్సరం 6వ సెమిస్టర్ విద్యార్థులకు అవసరమైన ఇంటర్న్‌షిప్ పొందేందుకు అవకాశాలు మెరుగుపర్చనున్నారు. ఈ ఎంఓయూ విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుస్తుందని కళాశాల ఐక్యూ కోఆర్డినేటర్ బి.రాజు తెలిపారు. ఫౌండేషన్ నిర్వాహకులు నవీన్‌కుమార్‌కు కళాశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలియజేశారు. ఇంటర్న్‌షిప్ కోఆర్డినేటర్ తిరుపతిరావు, ఎం.శాంతి, కె.శ్రీనివాసరావు, రాఘవేంద్రనాయుడు, జగన్మోహనరావు పాల్గొన్నారు.

నిబంధనలపై అవగాహన అవసరం

పాలకొండ రూరల్: సాంకేతికను, సెల్‌ఫోన్ ద్వారా అనవసరంగా వ్యక్తిత్వ హననం చేసేలా, విద్వేషాలు రెచ్చగొట్టేలా, వివాదాస్పద, సంపూర్ణ సమాచారం లేకుండా పోస్టులు చేయటం చట్టరీత్యా నేరమని సీఐ ఎం.చంద్రమౌళి అన్నారు. సమీప జిల్లాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాతో పాటు ఆయా రంగాలకు చెందినవారు నిబంధనలు పాటించాలన్నారు. ఈ మేరకు ఉన్నతాధికారుల సూచనలతో బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తప్పుడు, తెలియని సమాచారంతో కూడిన పోస్టులు చేయటం, వర్గ పోరుకు దారితీసే మెసేజ్‌లు, ఫోటో మార్ఫింగ్ చేసి తప్పుడు పోస్టులు చేయటం వలన ఏర్పడే సమస్యలపై అవగాహన కల్పించారు. ఆయా గ్రూపులకు చెందిన అడ్మిన్లు బాధ్యత వహించాల్సి వస్తుందని గుర్తుచేశారు. అన్నివర్గాల వారు ఈ సందేశాన్ని సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు.

ఘనంగా స్వామివారి జన్మదిన వేడుకలు

పాలకొండ రూరల్: అన్నపూర్ణా సహిత సనారీ విశ్వేశ్వనాథ అవధూత స్వామివారి జన్మదిన వేడుకలను భక్తులు బుధవారం సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పాలకొండ కోమటిపేటలో గల స్వామి ఆలయంలో వేకువజాము నుంచి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం స్వామివారికి ఊయల సేవ చేపట్టారు. అర్చకులు ప్రసాద్‌పాడి నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకల్లో స్థానిక భక్తులతో పాటు, విశ్వబ్రాహ్మణ, వైశ్య సంఘాలకు చెందిన పలువురు భాగస్వాములయ్యారు. అనంతరం అన్నసమారాధన చేశారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

పాలకొండ రూరల్: పట్టణంలో ఎన్.కె.రాజపురం ప్రాంతానికి చెందిన మొబైల్ షాప్ నిర్వాహకుడు పైల రామ్మోహనరావు ఇటీవల సీతంపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. స్థానిక కోటదుర్గ మొబైల్‌షాప్స్ అసోసియేషన్ సభ్యులు బుధవారం మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. రూ.11 వేలు ఆర్థిక సాయం అందించారు. మృతుని తల్లిదండ్రులు శ్రీరాములు, చిన్నమ్మను ఓదార్చారు. అసోసియేషన్ తరఫున ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

ధాన్యం నిల్వలో మెలకువలు





చింతాడ వద్ద యంత్రాల సాయంతో వరి కోతలు చేపడుతున్న రైతు (ఇన్‌సెట్లో) ఎన్ని వాహిని, మండల వ్యవసాయాధికారిని, పాలకొండ

పాలకొండ రూరల్: ఖరీఫ్ సీజన్ పూర్తికావచ్చింది. వరి కోతలు, నూర్పులు వేగంగా జరుగుతున్నాయి. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కాకపోవడంతో ధాన్యం భద్రత రైతులకు సవాలుగా మారింది. కోసిన పంట, ధాన్యం తడిస్తే ఆరబెట్టేందుకు రైతులు అవస్థలు పడాల్సి వస్తుంది. తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే పంటలో 10 నుంచి 20 శాతం నష్టపోయే ప్రమాదం ఉంటుంది. ధాన్యం భద్రపరచడంలో తగిన జాగ్రత్తలు పాటించాలని పాలకొండ వ్యవసాయాధికారిని ఎన్ని వాహిని సూచిస్తున్నారు.

తేమ 14 శాతం దాటితే నష్టం

ఇంటి అవసరాలకు, వచ్చే సీజన్‌లో విత్తనాల కోసం ఏడాదికి పైగా ధాన్యం భద్రపరచాల్సిఉంటుంది. ఈ క్రమంలో సహజమైన రంగు ధాన్యం కోల్పోతుంది. వరి కోతల సమయంలో ధాన్యంలో 20 శాతం తేమ ఉంటుంది. పంట కోసిన తరువాత వరి పనలను మూడు అంతకంటే ఎక్కువ రోజులు ఆరబెట్టడం వలన 4 నుంచి 6 శాతం తేమ తగ్గవచ్చు. 14 శాతానికి మించి తేమ ఉంటే ధాన్యంలో బూజు పట్టే అవకాశాలు ఉంటాయి. అలాగే తడిసిన ధాన్యం ఆరుబయట బాగా ఆరబెట్టుకోవాలి. నిల్వ చేసే సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే కీటకాలు ఆశించి నష్టం కలుగజేస్తాయి. అంతేకాక ఎలుకలు ధాన్యాన్ని తినేయటం, వాటి విసర్జనలతో కలుషితమయ్యే ప్రమాదం ఉంది.



ధాన్యం భద్రపర్చేందుకు గోనెసంచులు సిద్ధం చేస్తున్న వైనం

ముక్కు పురుగు

పంట కోయడానికి ముందు నుంచే ముక్కు పురుగు నష్టం కలిగిస్తుంది. బియ్యంలో తెల్లని పురుగులుగా కనిపించేవి లార్వా దశలో ఉన్న ఈ పురుగులే. తల్లి కీటకం వడ్ల గింజకు చిన్న రంధ్రం చేసి అందులో గుడ్లు పెట్టి తన నోటి నుంచి వెలువడే కొవ్వు పదార్థంతో రంధ్రాన్ని మూసి వేస్తుంది. లార్వా ప్రౌఢ దశలోని ముక్కు పురుగు గింజ లోపల బియ్యం తింటూ నష్టం కలిగిస్తుంది.

వడ్ల చిలుక

ధాన్యానికి వడ్ల చిలుక ఆశిస్తే ధాన్యం చెడు వాసన వస్తుంది. తల్లి కీటకం వరి గింజలపై గుంపులుగా చేరి గుడ్లు పెడుతుంది. గుడ్లు పగిలి లార్వా గింజ లోపలికి తొలుచుకు పోయి బియ్యపు గింజను తింటుంది. అనంతరం ప్యూపా దశ చేరక ముందే పైపొట్టులో చిన్న రంధ్రం చేస్తుంది. ప్రౌఢ దశకు చేరిన తరువాత ఆ రంధ్రం ద్వార వడ్ల చిలుక బయటికి వస్తుంది. ఇది ధాన్యం మూటలు, వరిపంటను నిల్వ చేసే గిడ్డంగుల్లో అధికంగా కనిపిస్తుంది.

నుసి పురుగు

దీనినే పుచ్చ పురుగు లేదా పెంకు పురుగు అంటారు. ఇది గొట్టపు ఆకారంలో చాలా చిన్నదిగా ఉంటుంది. ప్రౌఢ కీటకం ధాన్యం గింజలకు నష్టం కలిగిస్తుంది. ఇది ప్రారంభ దశలో చెత్తను, ఆ తరువాత గింజపై పొరను, ఆ తర్వాత లోపలి గింజను తిని తీవ్ర నష్టం కలిగిస్తుంది. ఈ తరహా కీటకాలు కలిగించే నష్టాలపై అవగాహన పెంచుకోవాలి.

ధాన్యం నిల్వ చేసే పద్ధతి

రైతులు తక్కువ ధాన్యం నిల్వ చేసుకోవాలంటే వెదురు గాదెలు, సిమెంటు గాదెలు, లోహపు గాదెలను ఉపయోగించవచ్చు. ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని నిల్వ చేసుకోవాలనుకుంటే గోదాంలు లేదా గిడ్డంగులు వినియోగిస్తే పూర్తి రక్షణ ఉంటుంది. ఈ నిల్వ కేంద్రాల్లోకి కీటకాలు, తేమ, వర్షపు నీరు పోకుండ జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలుక కన్నాలు ఉంటే గాజు ముక్కలు, సిమెంటుతో పూడ్చి వేయాలి. ధాన్యం నిల్వలకు కొత్త గోనె సంచులు ఉపయోగించడం మేలు. గోనె సంచుల పైన, లోపల మలాథియాన్ లేదా ఎండో సల్ఫాన్ ద్రావణం స్ప్రే చేసి ఒక రోజు ఎండబెట్టాలి. ఈ తరహా సంచులు వాడటం వలన కీటకాల నుంచి రక్షణ పొందవచ్చు.

ఎలుకల నుంచి రక్షణ చర్యలు

ధాన్యం నిల్వ చేసే గిడ్డంగి చుట్టూ చెత్త లేకుండా రోజూ శుభ్రం చేయాలి. వివిధ రకాలైన బోనులు, బుట్టలను ఉపయోగించి ఎలుకలను నిర్మూలించాలి. గిడ్డంగి తలుపుల కింది భాగాలకు జింకు రేకులు అమర్చాలి. రంధ్రాలకు వైర్ మెస్ మూతలు అమర్చాలి. ఇలాంటి జాగ్రత్తలు పాటిస్తే ఎక్కువ రోజులు ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవచ్చు.

బహుళ పంటలతో అధిక దిగుబడులు



సూచనలిస్తున్న రీజనల్ ఆఫీసర్ ప్రకాష్‌రావు

సీతంపేట: ప్రకృతి వ్యవసాయంలో వరిపొలాల గట్లపై వేసిన బహుళ పంటలు అధిక దిగుబడులు ఇస్తాయని ప్రకృతివ్యవసాయం రీజనల్ ఆఫీసర్ ప్రకాష్‌రావు అన్నారు. మండలంలోని మండకాలనీ, గొయిది ప్రాంతాల్లో వేసిన పంటలు బుధవారం ఆయన పరిశీలించారు. ఏ గ్రేడ్, ఏటీఎం మోడల్స్ పంటలు సాగు చేస్తున్న రైతులతో మాట్లాడి సాగు ఖర్చులు, ఆదాయ వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాబోయే రబీ సీజన్‌లో చేయాల్సిన కార్యక్రమాలపై సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఆర్‌టీవో హేమసుందర్, ఎస్ఎఫ్ఏ మునలయ్య, డివిజన్ ఇన్‌చార్జ్ బాలు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

సీతంపేట: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వై.అమ్మన్నరావు అన్నారు. మండలంలోని కుడ్డపల్లి జంక్షన్ వద్ద ప్రజలకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఆన్‌లైన్ గేమ్స్, ఆఫర్లు, లక్కీడ్రాల పేరుతో సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నట్టు చెప్పారు. అపరిచితులతో బ్యాంకు ఖాతా నంబరు, ఓటీపీ, పిన్ వివరాలు పంచుకోవద్దన్నారు. ప్రతి ఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ అమ్మన్నరావు

మత్స్యకార సంఘానికి గుర్తింపు



వలలో పడిన చేపలను ఏవిధంగా ఏరాలో వివరిస్తున్న మత్స్యశాఖ అధికారులు

వీరఘట్టం: మండలంలోని పీవీఆర్‌పురంలో కొత్తగా ఏర్పాటైన మత్స్యకార సంఘానికి జిల్లా మత్స్యశాఖ అధికారులు బుధవారం నైపుణ్య పరీక్షలు నిర్వహించి ఆ సంఘానికి గుర్తింపు ఇచ్చారు. గ్రామానికి చెందిన 14 మంది మత్స్యకారులు శ్రీసింహాద్రి స్వదేశీ మత్స్యకార సంఘంగా ఏర్పాటయ్యారు. తమ సంఘానికి ప్రభుత్వ పరంగా గుర్తింపు ఇవ్వాలని కోరడంతో వారికి నైపుణ్య పరీక్ష నిర్వహించినట్లు మత్స్యశాఖ డివిజనల్ అధికారి డి.గోపీకృష్ణ తెలిపారు. వీరఘట్టం సమీపంలోని వెంకమ్మచెరువు వద్ద వారికి ఈత, చేపలు పట్టడం, వల విసరడం, వలలో పడిన చేపలను ఏరడం, వలను భద్రపరుచు విధానం, తదితర అంశాల్లో వారి నైపుణ్యాలను పరీక్షించారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి వి.తిరుమలయ్య, సంతోష్‌కుమార్, వై.మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

15లోగా ప్రీమియం చెల్లించాలి

సీతంపేట, భామిని: జీడి మామిడి సాగు చేసే రైతులు ఈ నెల 15లోగా పంట బీమా ప్రీమియం చెల్లించాలని హార్టీకల్చర్ అధికారి పేడాడ జయశ్రీ అన్నారు. మండలంలోని సన్నాయికాలనీలో గిరిజన జీడిరైతులతో బుధవారం సమావేశమై పంటల బీమాపై అవగాహన కల్పించారు. జీడికి ఎకరానికి ఏడాదికి రూ.1600లు చొప్పున ప్రీమియం చెల్లించి బీమా చేయించుకోవాలని సూచించారు. పంట నష్టం కలిగితే ఎకరానికి రూ.32 వేలు వరకు పరిహారం వస్తుందని ఇఫ్‌కో బ్లాక్ కోఆర్డినేటర్ కొండగొర్రి రవికుమార్ వివరించారు. బీమా సౌకర్యం కోసం రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.



భామిని: గిరిజన రైతులతో మాట్లాడుతున్న హెచ్‌టీఓ పేడాడ జయశ్రీ

13 మద్యం బాటిళ్లు స్వాధీనం

వీరఘట్టం: స్థానిక కొత్త బస్టాండ్‌కు చెందిన ఎస్.నాగభూషణరావు అనే వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న 13 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి బుధవారం తెలిపారు. వీరఘట్టంలో కొత్త బస్టాండ్‌లోని పలు పాన్ షాపుల్లో సోదాలు చేయగా మూడు చోట్ల మద్యం బాటిళ్లు దొరికినట్లు స్థానికులు చెపుతున్నారు. అలాగే తూడి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తి నుంచి మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు గ్రామస్తులు తెలిపారు. అయితే ఎక్సైజ్ అధికారులు మాత్రం ఒక్కరిపైనే కేసు నమోదు చేయడంపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఈ విషయాన్ని ఎక్సైజ్ సీఐ సూర్యకుమారి వద్ద ప్రస్తావించగా పూర్తి వివరాలు గురువారం తెలియజేస్తామన్నారు.

ఏనుగులను కవ్వించొద్దు

భామిని: ఏనుగుల జోలికి వెళ్లొద్దని, కవ్వింపు చర్యలు చేపట్టి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఆదివాసీ గిరిజనులకు పాలకొండ ఫారెస్ట్ రేంజర్ కె.రామారావు బుధవారం సూచించారు. మండలంలోని నల్లరాయిగూడ సమీపంలోని తివ్వాకొండల్లో పాలకొండ, కొత్తూరు సెక్షన్ అధికారులు ఆర్.హరికృష్ణ, ఎస్.రజినీకాంత్‌తో కలిసి ఏనుగుల గుంపు చేస్తున్న పంటనష్టాలను పరిశీలించారు. అనంతరం నల్లరాయిగూడ గిరిజన రైతులతో మాట్లాడుతూ పంట నష్టాలపై ఆందోళన వద్దన్నారు. పంట నష్టాలపై దరఖాస్తులు అందజేస్తే తగిన పరిహారం ఇప్పిస్తామన్నారు.

వ్యక్తికి గాయాలు

సీతంపేట: గడిగుడ్డి సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముకుందాపురం గ్రామానికి చెందిన ఎన్.శ్యామలరావు గాయపడ్డాడు. సీతంపేట నుంచి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గడిగుడ్డి సమీపంలో ఎదురుగా వస్తున్న మహిళను తప్పించబోయి పక్కనున్న డివైడర్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడిని 108లో స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించినట్టు వైద్యులు తెలిపారు.

ఏబీ రోడ్డు దుస్థితి పట్టదా?

భామిని: మండలంలోని ఏబీ రోడ్డు దుస్థితి టీడీపీ కూటమి నాయకులకు పట్టదా అని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు బుధవారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు. 45 రోజుల క్రితం ఆర్అండ్‌బీ ఈఈని కలిసి రోడ్డు పరిస్థితిపై వినతి పత్రం ఇచ్చినట్లు పేర్కొన్నారు. పది రోజుల్లో రోడ్ల మరమత్తులు చేస్తామన్నారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ రోడ్డుపై రాకపోకలకు సాగించే వారంతా ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పది రోజుల్లో రోడ్డు పనులు చేపట్టకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

పౌష్టికాహార కిట్లు అందజేత



పౌష్టికాహార కిట్లు అందిస్తున్న ఎంపీటీసీ చంద్రశేఖర్

భామిని: గర్భిణులు, బాలింతల ఆరోగ్యం కోసం అందిస్తున్న పౌష్టికాహారాన్ని దుర్వినియోగం చేయొద్దని జేసీఎస్ మండల కోఆర్డినేటర్, ఎంపీటీసీ కొత్తకోట చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని సొలికిరి అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు బుధవారం నెలవారీ పౌష్టికాహార కిట్లు అందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నిఘా నేత్రానికి మోక్షం

వీరఘట్టం: వీరఘట్టం ప్రధాన రహదారిలో పోలీస్ స్టేషన్‌కు సమీపంలో సీసీ కెమెరాలను బుధవారం ఏర్పాటు చేశారు. మూడేళ్ల క్రితం వీరఘట్టం ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపట్టినప్పుడు ఈ సీసీ కెమెరాలను తొలగించారు. మరలా మూడేళ్ల తర్వాత వాటిని ఏర్పాటు చేశారు. అయితే ప్రధాన రహదారిలో రెండు చోట్లు గతంలో సీసీ కెమెరాలు ఉండేవి. ప్రస్తుతం ఒక్క చోటే కెమెరాలు ఏర్పాటు చేశారు. వీటిని శ్రీకాకుళంలోని పోలీసు కంట్రోల్ రూమ్‌తో అనుసంధానం చేశారు.



ప్రధాన రహదారిలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలు

● ఊపందుకున్న వరి కోతలు



గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీ ప్రాంతాల్లో వరి కోతలు ఊపందుకున్నాయి. ప్రస్తుతం వాతావరణం అనుకూలించడంతో మండల వ్యాప్తంగా వరి కోతలు చకచకా జరుగుతున్నాయి. రైతులంతా కోసిన పంటను నూర్పిడి కోసం కల్లాలకు తరలిస్తున్నారు. ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా ఉంటుందని అన్నదాతలు భావిస్తున్నారు.

-గుమ్మలక్ష్మీపురం

అగ్నిప్రమాదాలపై అప్రమత్తం

వీరఘట్టం: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పాలకొండ అగ్నిమాపక కేంద్రం అధికారి జామి సర్వేశ్వరరావు సూచించారు. వండువ జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు బుధవారం అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు మంటలు అదుపు చేసే వివిధ పద్ధతులను వివరించారు. అలాగే ప్రమాదాల్లో గాయపడిన వారికి అందించాల్సిన ప్రథమ చికిత్స, మండల్లో చిక్కుకున్న వారిని ఎలా రక్షించాలో విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.సూర్యనారాయణ, ఉపాధ్యాయులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.



క్షతగాత్రులను ఎలా రక్షించాలో విద్యార్థులకు వివరిస్తున్న ఫైర్ ఆఫీసర్ సర్వేశ్వరరావు

పైప్‌లైన్ ఏర్పాటుకు చర్యలు

వీరఘట్టం: మండలంలోని కుమ్మరిగుంటలో జలజీవన్ మిషన్ పథకం కింద తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు గ్రామస్తులు తమ ఇళ్ల ముందు ఉన్న కట్టడాలను తొలగించేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. ఈ మేరకు అధికారులు ఇళ్ల ముందు ఉన్న కట్టడాలను బుధవారం తొలగించారు. మురుగు కాలువల నిర్మాణం చేపట్టి, జలజీవన్ మిషన్ పైప్‌లైన్ ఏర్పాటు చేసే విధంగా రోడ్డుకు ఇరువైపులా 15 అడుగుల వరకు కట్టడాలను తొలగించారు. అయితే పైప్‌లైన్ వేసేందుకు నిధులు ఉన్నప్పటికీ, కాలువల నిర్మాణానికి నిధులు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి చక్రధర్ వద్ద ప్రస్తావించగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.



పైప్‌లైన్ ఏర్పాటుకు రోడ్డుపై ఉన్న కట్టడాలను తొలగించిన దృశ్యం

పక్కాగా ఎన్నికల నియమావళి అమలు చేయాలి

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): పక్కాగా ఎన్నికల నియమావళి అమలు చేయాలని ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి సూచించారు. ఇదే విషయమై ఆమె కురుపాం మండల కేంద్రంలోని తన కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌వోలతో బుధవారం సమావేశమయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో ఈ నెల 4వ తేదీ నుంచే ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, ఎక్కడైనా రాజకీయ పార్టీలు బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగులు ఉంటే వాటిని వెంటనే తొలగించాలని తెలిపారు. అలాగే రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయాలన్నారు. రాజకీయ సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు జరగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.నారాయణరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఉమామహేశ్వరి

నేత్ర శస్త్రచికిత్సకు పలువురి ఎంపిక

కొమరాడ: మండలంలోని పరశురాంపురంలో బుధవారం నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో పలువురిని నేత్ర శస్త్రచికిత్సకు ఎంపిక చేసినట్లు జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి తెలిపారు. శిబిరానికి హాజరైన వారి కళ్లను వైద్యులు పరీక్షించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కెటరాక్ట్, కొయ్యకండ, గ్లకోమా వంటి కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని ఉచిత ఆపరేషన్లకు ఎంపిక చేశారు. ఆపరేషన్ చేసిన తర్వాత కళ్లజోడు, మందులు కూడా అందజేయడం జరుగుతుందని వెల్లడించారు. అనంతరం నేత్రదానంపై అవగాహన కల్పించి, ప్రతిఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ సుకుమార్‌బాబు, నేత్ర వైద్య సహాయకుడు రమేష్ పాల్గొన్నారు.



శిబిరంలో నేత్ర వైద్య తనిఖీలు చేస్తున్న సిబ్బంది

దీర్ఘకాలిక రోగులపై ప్రత్యేక దృష్టి

గరుగుబిల్లి:

దీర్ఘకాలిక రోగులపై ప్రత్యేక దృష్టి సారించాలని వైద్యారోగ్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు సిబ్బందికి సూచించారు. మండలంలోని ఉల్లిభద్ర గ్రామంలో ఉన్న హెల్త్ వెల్‌నెస్ సెంటర్ సహా అంగన్‌వాడీ కేంద్రాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా బుధవారం సందర్శించారు. వెల్‌నెస్ కేంద్రానికి రోజుకు ఎంతమంది రోగులు వస్తున్నారు?.. వారు ఏయే సమస్యలతో బాధపడుతున్నారు వంటి విషయాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బీపీ, సుగర్, కేన్సర్, గుండెపోటు వంటి ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారి ఆరోగ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి, పిల్లల ఆరోగ్యం, చదువుపై దృష్టిసారించాలని ఆదేశించారు. సామ్, మామ్‌గా గుర్తించిన పిల్లలకు ఏ విధమైన చర్యలు చేపడుతున్నారని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉన్నత పాఠశాలకు వెళ్లిన ఆయన.. కిశోరి బాలికల హిమోగ్లోబిన్ పరీక్షల రికార్డులు, వారి ఆరోగ్య పరిస్థితులను రికార్డుల ఆధారంగా పరిశీలించి, పలు సూచనలు చేశారు. విద్యార్థుల చదువుతో పాటు వారి ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని ఉపాధ్యాయులకు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.శ్రీనివాస్, కార్యాలయ ఈవో సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థిని ఆరోగ్యంపై ఆరాతీస్తున్న డీపీవో జగన్మోహనరావు